ప్రజాశక్తి

సోమవారం 15 సెప్టెంబర్ 2025



నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని తెలిపారు. అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కోరారు. Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

ఉద్ధృతంగా శాస్త్ర విజ్ఞాన ప్రచారం

- ఎఐపిఎస్ఎన్ ప్రధానకార్యదర్శి ఆషా మిశ్రా
- ప్రజాఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలి : రామచంద్రయ్య
- ఘనంగా ముగిసిన జెవివి రాష్ట్ర మహాసభ

ఎన్నికైన జెవివి రాష్ట్ర నూతన కార్యవర్గం

ప్రసంగిస్తున్న ఎఐపిఎస్ఎన్ ప్రధానకార్యదర్శి ఆషా మిశ్రా

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కంటోన్మెంట్

సామాజిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక పరిణామాల నేపథ్యంలో శాస్త్ర విజ్ఞానం ప్రచారాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లాలని ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ జనరల్ సెక్రెటరీ ఆషా మిశ్రా అన్నారు. నగరంలోని గురజాడ అప్పారావు ప్రాంగణం (జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణం)లో జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన రెండురోజులు పాటు అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగిన రాష్ట్ర 18వ మహాసభలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మహాసభ చేసిన పది తీర్మానాలను ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. శాస్త్ర విజ్ఞాన ప్రచారాన్ని మరింత ఉద్ధృతంగా సాగించాలని ప్రతినపూనారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు ప్రవేశపెట్టిన నివేదికను సభ్యులంతా ఆమోదించారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై మాజీఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ప్రసంగించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆషామిశ్రా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. ఎఐపిఎస్ఎన్ ఆశించిన దాని కంటే జెవివి మరింత కషి చేస్తుందన్నారు యువజన, మహిళా కార్యకర్తలు చురుగ్గా పనిచేస్తున్నారని అభినందించారు. సైన్సుపై దాడి జరుగుతున్న నేపథ్యంలో మన కార్యక్రమాలకు మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. చెకుముకి ఎడిటర్, జెవివి ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎ.రామచంద్రయ్య మాట్లాడుతూ డిజిటల్ మీడియా ద్వారా కుహనా సైన్స్ ముందుకు వేగంగా సాగుతుందన్నారు. దీన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ మీడియా ద్వారా మన వాయిస్‌ను పెంచాల్సిన అవసరం ఉందన్నారు ఐదేళ్లకొకసారి రెండు రాష్ట్రాల జనవిజ్ఞాన వేదికలు సమావేశం నిర్వహించి విషయాలను షేర్ చేసుకొని ప్రజా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు.

చెకుముకి ఎడిటర్ రామచంద్రయ్య

జెవివి నాయకులు రాజగోపాల్

మూఢనమ్మకాలపై అవగాహన కల్పించేందుకు కళ్లకు గంతలు కట్టుకుని ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న ఎ.ప్రసాద్

మహిళా యువతకు సైన్సును అందించడమే లక్ష్యం

మహిళలకు సైన్సు అందించడమే ధ్యేయంగా జెవివి సమతా విభాగం పనిచేస్తుందని సమత రాష్ట్ర నాయకులు తెలిపారు. మహాసభలో పలు జిల్లాలకు చెందిన సమతా సభ్యులు ఆయా జిల్లాల్లో చేస్తున్న కార్యక్రమాలను, విద్యాసంస్థల్లో చేస్తున్న ప్రచారాలను వివరించారు. యువత సన్మార్గంలో నడిచే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. సభలో జెవివి జిల్లా నాయకులు వి.రాజగోపాల్ మాట్లాడారు. మహాసభలో జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, నాయకులు చీకటి దివాకర్, వి.రాజగోపాల్, సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, రాష్ట్రనాయకులు, మహాసభకు వచ్చిన ప్రతినిధులు, విద్యావేత్తలు, మేధావులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం

నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రాష్ట్ర కమిటీ ఎన్నిక అనంతరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎస్ లక్ష్మణరావు, టి.సురేష్ మాట్లాడారు. నేడు జెవివి అవసరం దేశానికి, ప్రజలకు ఎంతో అవసరమన్నారు. లౌకిక రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. రానున్న కాలాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని జెవివిని మరింత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మహాసభ మన ముందు చాలా కర్తవ్యాలను ఉంచిందని, వాటిని అమలు చేసేందుకు రానున్న కాలంలో కృషి చేస్తామని తెలిపారు.

75 మందితో జెవివి రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

మహాసభలు సందర్భంగా జెవివి రాష్ట్ర నూతన కమిటీ 75మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షులుగా కెఎస్ లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా టి.సురేష్, కోశాధికారిగా జి.మురళీధర్, ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యదర్శులుగా డాక్టర్ ఆదిశేషు, జిహెచ్ఎస్‌పి వర్మ, స్వరూపరెడ్డి, వైఎఆర్‌కె ప్రసాద్, శివరాం, బి.రవికుమార్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్, డాక్టర్ కాలేషా, వైఎస్ నాగేశ్వరరావు, సిహెచ్ జయప్రకాష్, మాణిక్యం శెట్టి, రెడ్డప్ప ఎన్నికయ్యారు. జెవివి సబ్ కమిటీ కన్వీనర్లుగా జి.నిర్మల (సమత), జి.గిరిధర్ (విద్య), కెఎంఎం (చెకుముకి), ఎంవి చలపతి (శాస్త్ర విజ్ఞానం), జి.మహేష్ (యువత), డి.బుజ్జిబాబు (పబ్లికేషన్) ఎన్నికయ్యారు. 54మంది రాష్ట్ర కమిటీ సభ్యులతో మొత్తం 75 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, జెవివి నాయకులు

సైన్స్‌వాక్‌లో పాల్గొన్న జెవివి ప్రతినిధులు

ఆకట్టుకున్న సైన్స్ వాక్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహాకవి గురజాడ అప్పారావు నివాసాన్ని సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఆయన పేరు మీద గురజాడ సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. జెవివి రాష్ట్ర మహాసభల్లో భాగంగా స్థానిక మయూరి హోటల్ ప్రాంతం నుంచి ట్యాంక్ బండ్, బాలాజీ జంక్షన్, కోట జంక్షన్, గురజాడ అప్పారావు నివాసం మీదుగా గురజాడ విగ్రహం, సంగీత కళాశాల వరకు వందలాది మంది సైన్స్ వాక్ నిర్వహించారు. వాక్‌ను జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు జెండాఊపి ప్రారంభించారు. వాక్‌లో పాల్గొన్న వారంతా 'గురజాడ అడుగుజాడ.. జాతికి వెలుగు జాడ, శాస్త్ర పరిశోధనలకు తగిన నిధులు కేటాయించాలి. కావాలి ప్రయోగాలతో కూడిన సైన్సు బోధన, భావ ప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను ఖండించండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా గురజాడ నివాసాన్ని, సంగీత కళాశాలను ప్రతినిధులంతా సందర్శించారు. ఎంఆర్ కళాశాల సమీపాన గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాకారులు గురజాడ గేయాలను ఆలపించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గురజాడ అంటే తెలుగువారు గర్వంగా చెప్పుకునే దేశభక్తుడు అని అన్నారు. ఆయన నివాసాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పరిరక్షించి, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ఆయన రచనల్లో ప్రతిపాదించిన సంఘ సంస్కరణలు నేడు అనుసరించదగ్గవన్నారు. ఆయన పేరు మీద గురజాడ సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సైన్స్ వాక్‌లో అనంతపురం జిల్లాకు చెందిన ఎ.ప్రసాద్ కళ్లకు గంతలు కట్టుకొని వాక్ ముందు భాగంలో బైక్‌ను నడిపారు. అదే విధంగా అగ్నితో కాలుతున్న కర్రను వంటికి రాసుకుని సైన్స్ ప్రదర్శన చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు పిల్లి మొగ్గలు వేస్తూ అలరించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, నాయకులు చీకటి దివాకర్, రాజ్ గోపాల్, సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, జెవివి రాష్ట్రనాయకులు, మహాసభకు వచ్చిన ప్రతినిధులు, విద్యావేత్తలు, మేధావులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ, రాజ్యాంగ రక్షణకు ఉద్యమం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు

మహాసభలనుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు సౌహార్ద సందేశమిచ్చారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత జెవివి బాధ్యత తీసుకోవాల్సిందే నన్నారు. రాజ్యాంగం కల్పించిన సైంటిఫిక్ టెంపర్ ముందుకు తీసుకువెళ్ళాలన్నారు. యువతను ప్రోత్సహించడం అభినందనీయ మన్నారు. చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారితో గెట్ టుగెదర్ నిర్వహించాలని కోరారు. 2014లో మన దగ్గర డబ్బును దోచుకునే పని ప్రారంభమైందని, మరో సారా, అక్షరాస్యత ఉద్యమం మాదిరిగా విద్యా రంగం, రాజ్యాంగం రక్షణ ఉద్యమాన్ని చేపట్టాలని ఆయన ఆకాక్షించారు.

సైన్స్ ఉద్యమంలో భాగస్వాములుగా ఉంటాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్

మహాసభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ సౌహార్ద సందేశమిచ్చారు. అమెరికా సామ్రాజ్య వాదం ప్రపంచ యుద్ధాలను ప్రోత్సహించి దోచుకోవడానికి చూస్తోందన్నారు. మరో వైపు సైన్సు, టెక్నాలజీ వైపు మరొక కూటమి ఉందన్నారు. నేడు మతం పేరుతో, విద్యా కాషాయీకరణ చేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. శ్రీలంక, నేపాల్, జపాన్ వంటి దేశాల్లో నిరంకుశత్వానికి వ్యతిరేకంగా యువత పోరాడుతోందన్నారు. నేడు అటువంటి పరిస్థితులు దేశంలో కూడా ఉన్నాయన్నారు. భవిష్యత్‌లో సైన్స్ ఉద్యమంతో విద్యార్థి సంఘంగా కలిసి పని చేస్తామని తెలిపారు.

రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు

ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

త్వరలో రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వస్తాయని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. విజయనగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ ఆదివారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే సుమారు 11 లక్షల కోట్ల పెట్టుబడులు సిద్ధంగా ఉన్నాయని, ఇవన్నీ కార్యరూపం దాల్చి ఫలితాలను ఇవ్వడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత యువతను దృష్టిలో పెట్టుకొని ప్రతీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఇ పార్కును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 50 పార్కులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 11 పార్కుల్లో ప్లాట్ల కేటాయింపు కూడా జరుగుతోందన్నారు. మెరుగైన వైద్య సదుపాయాలను వీలైనంత త్వరగా ప్రజలకు అందించే లక్ష్యంతోనే వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య రంగం నిర్వీర్యమైందని, మౌలిక సదుపాయాల కల్పన పడకేసిందని చెప్పారు.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

యూరియా అధికంగా వినియోగించొద్దు

త్వరలో రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని మంత్రి తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా అధికంగా యూరియాను వినియోగించడం మంచిది కాదని అన్నారు. పైడితల్లి అమ్మవారి పండుగను గతేడాది మాదిరిగా ఈసారి కూడా భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

తాటిపూడి రిజర్వాయరు వద్ద గొర్రిపాటి బుచ్చి అప్పారావు విగ్రహం ఏర్పాటు కోసం మంత్రి రూ.లక్ష అందజేశారు.

రూ.40.85 కోట్లతో 6 రహదారుల అభివృద్ధి

- మరో ఎనిమిది స్టేట్ హైవేల అభివృద్ధికి రూ.26.62 కోట్లతో ప్రణాళిక
- రెండు రోడ్లూ జాతీయ రహదారులుగా ప్రతిపాదన
- విజయనగరం అతిథి గృహానికి మరమ్మతులు
- ప్రజాశక్తితో ఆర్అండ్‌బి ఇఇ జేమ్స్ ముఖాముఖి

నాబార్డు నిధులతో జిల్లాలో ఆరు ఆర్అండ్‌బి రోడ్ల అభివృద్ధికి రూ.40.85 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయని ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.జేమ్స్ తెలిపారు. మరో ఎనిమిది స్టేట్ హైవేల అభివృద్ధికి రూ.26.62కోట్లతో ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. మరోవైపు పలుచోట్ల రోడ్డుమరమ్మతు పనులు జరుగుతున్నాయని వివరించారు. విజయనగరం ఆర్అండ్‌బి అతిథి గృహం మరమ్మతు పనులు జరుగుతున్నట్టు తెలిపారు. కొత్తగా రెండు రహదారులను జాతీయ రహదారిగా మార్పు చేసేందుకు ప్రతిపాదనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు.

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

ఏయే రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి?

విజయనగరం నుంచి భూపాలపురం 7కిలో మీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి రూ.1.75కోట్లు మంజూరయ్యాయి. పినపెంకి నుంచి ఆకులకట్ట వరకు 8.25 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.2.90కోట్లు, విజయనగరంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి బాలజీ జంక్షన్ వరకు 4.5కిలో మీటర్ల మేర పనులకు రూ.3కోట్లు, 42వ జాతీయ రహదారి నుంచి కొంపంగి, జక్కువ మీదుగా పోరాం గ్రామానికి వెళ్లే రహదారిలో సుమారు 3.4కిలో మీటర్ల దారి అభివృద్ధికి రూ.1.80కోట్లు, కైలాం నుంచి జయితి, ఇప్పలవలస మీదుగా కొండలింగాలవలస వరకు ఉన్నదారిలో 6కిలోమీటర్ల మేర పనికి రూ.1.20కోట్లు, కొత్తవలస నుంచి కె.కోటపాడు మీదుగా సబ్బవరం రహదారి 13.4కిలోమీటర్ల అభివృద్ధికి రూ.3.20కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయి.

రోడ్డు అభివృద్ధి పనులు ఎప్పటిలోగా ప్రారంభిస్తారు?

పైన పేర్కొన్న ఆరు రోడ్ల అభివృద్ధి పనులన్నీ త్వరలోనే ప్రారంభమౌతాయి. ఈ పనులన్నింటికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి అయ్యింది. సంబంధిత కాంట్రాక్టర్లు కూడా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఏడాదిలో ఈ పనులు పూర్తిస్థాయిలో జరుగుతాయి.

ప్రతిపాదనలోవున్న రోడ్ల అభివృద్ధి పనులు ఉన్నాయా?

జిఒ నెంబర్ 151 ద్వారా కొత్తగా ఎనిమిది రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు పంపాం. ఇంకా ప్రభుత్వం నుంచి ఆమోదం లభించాల్సి వుంది. ఇవన్నీ స్టేట్ హైవే రహదారులే. ఇందులో చిలకపాలెం నుంచి రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా వెళ్లే రాయగడ రహదారి ఒకటి. ఇందులో 19కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధి చేసేందుకు రూ.4కోట్లు అవసరం కానున్నట్టు ప్రతిపాదన పంపాం. బొబ్బిలి – తెర్లాం రోడ్లులో 4.6కిలోమీటర్ల పరిధికి రూ.4కోట్లు, గరివిడి – గర్భాం మధ్య 8.23కిలోమీటర్ల పరిధికి రూ.3కోట్లు, విజయనగరం నుంచి చింతపల్లి వెళ్లే రహదారిలో 15.95కిలో మీటర్ల పరిధికి రూ.3.90కోట్లు, విజయనగరం నుంచి చిన్నాపురం రహదారిలో 8.4కిలోమీటర్ల దారి అభివృద్ధికి రూ.1.50కోట్లు, రాజాం నుంచి రణస్థలం వరకు 10కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.4కోట్లు, విజయనగరం నుంచి పాలకొండ వరకు 14.71కిలోమీటర్ల పరిధి రహదారికి రూ.6కోట్లు, భీమసింగి నుంచి కొత్తవలస రహదారిలో 3.5కిలో మీటర్ల పరిధి దారికి రూ.22లక్షలు చొప్పున నిధులు అవసరం కానున్నాయి. ఇప్పటికే వీటికి సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.



జాతీయ రహదారులుగా ప్రతిపాదించిన రోడ్లు ఏమిటి?

చిలకపాలెం జాతీయ రహదారి నుంచి రామభద్రపురం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా వెళ్లే రాయగడ రహదారి ఒకటి. విజయనగరం నుంచి చీపురుపల్లి, రాజాం మీదుగా పాలకొండ రహదారి మరొకటి. ఈ రెండింటికి జాతీయ రహదారుల హోదా కల్పించి, అందుకనుగుణంగా అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. దీనికి సంబంధించిన ప్రపాదనలు పంపాం. అయితే, ఈ రహదారుల్లో వాహనాల ట్రాఫిక్, ఇతర అంశాల ఆధారంగా గుర్తింపు అనేది ఉంటుంది.

విజయనగరం ఆర్అండ్‌బి అతిథి గృహాన్ని పిపిపి తరహాలో స్టార్‌హోటల్‌గా మారుస్తారన్న ప్రచారం నిజమేనా?

మా దృష్టిలో అటువంటి ప్రతిపాదనేమీ ఇంతవరకూ లేదు. భవనం శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేపట్టేందుకు అంతరాయం కలిగింది. ఆ ప్రాంగణంలోకి అనధికార చొరబాటు లేకుండా ఇటీవలే ప్రహరీ నిర్మాణం పూర్తిచేశాము. లోపల కొన్ని గదులను కూడా పునర్నిర్మిస్తున్నాము. ఇంతకు ముందులా కాకుండా ప్రాంగణంలో భద్రత చర్యలు చేపట్టాము.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

సిఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం కోటలో ఎమ్మెల్యే బేబినాయన పంపిణీ చేశారు. సిఎం సహాయ నిధి పేదల వైద్యానికి ఎంతో దోహదం చేస్తుందని ఆయన చెప్పారు. తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన మరడాన చిన్నమ్మికి రూ.2.70 లక్షలు, బత్తుల రామారావుకు రూ.30 వేలు మంజూరు కావడంతో చెక్కులను అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

బాడంగి : మండలంలో పలువురిని ఆదివారం ఎమ్మెల్యే బేబినాయన పరామర్శించారు. ఇటీవల మరణించిన షేక్ అమీర్ సాహెబ్, చింతాడ అప్పారావు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. జర్నలిస్టు రాజా సాహెబ్ సోదరుడు అమీర్ సాహెబ్. చాలారోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కండి గవరయ్య కుమారుడు రామారావును, విలేకరి అమర్‌నాథ్ కుమారునికి శస్త్రచికిత్స జరగడంతో ఆయన్ను ఎమ్మెల్యే పరామర్శించారు. బాడంగి పిఎసిఎస్ భవనం శిథిలావస్థలో ఉందని, నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని పిఎసిఎస్ అధ్యక్షులు సత్యం.. ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవి, ఉపాధ్యక్షులు సింగిరెడ్డి భాస్కర్‌రావు, సర్పంచ్ కండి రమేష్, ఎంపిటిసి దేవరాపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అంబటి తవిటినాయుడు, గుణుపూరు స్వామినాయుడు, గుణుపూరి శ్రీనివాస్, మరడాన గాంధీ, చల్ల క్రిష్ణ పాల్గొన్నారు.

ఘనంగా పశువులమ్మ పండగ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో సింగరాయి, ఆకులసీతంపేట, వల్లంపూడి గ్రామాల్లో ఆదివారం పశువులమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ముందుగా పశువులను అమ్మవారి ఆలయానికి తరలించి, వాటికి పూజలు చేసి, ముడుపులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండాలని పశువులను పూజించడం ఆనవాయితీగా వస్తోంది.

పశువులకు ఉచితంగా టీకాలు

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలో సోమవారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఎడి రెడ్డి కృష్ణ తెలిపారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలను వేయనున్నట్లు చెప్పారు. మండలంలో సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి ప్రతి గ్రామానికీ వెళ్లి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకితే పశువుల్లో పునరుత్పత్తి సమస్య ఎక్కువగా వస్తుందన్నారు. ఇది ఎక్కువగా సంకరజాతి పశువుల్లో వ్యాప్తి చెందుతుందని చెప్పారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో వీటికి అడ్డుకట్ట వేయొచ్చని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుంతలను పూడ్చాక రోడ్డు ఇలా..

ఆగమేఘాలపై గుంతలు పూడ్చివేత
'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట కోనేరు మలుపు వద్ద రోడ్డు ఛిద్రమైన దుస్థితిపై 'అధ్వానంగా రహదారి' అనే కథనం ఆదివారం ప్రజాశక్తిలో రావడంతో అధికారులు స్పందించారు. ఆగమేఘాలపై రహదారిపై గుంతలను పూడ్చి వేశారు. క్రషర్ బుగ్గి వేసి, గోతులను పూడ్చి, తాత్కాలికంగా ఇబ్బంది లేకుండా చేశారు. గుంతల సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

సుపథ పోటీల్లో సోంపురం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-వేపాడ

శృంగవరపుకోట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సుపథ పోటీల్లో మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. శ్లోక పఠనంలో పి.బాలాజీ, వి.సుధీర్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. రామాయణం క్విజ్‌లో హెచ్.దిలీప్ ప్రథమ స్థానం, శ్రీకృష్ణ చరిత్ర క్విజ్ పోటీలో హెచ్.రక్షిత ద్వితీయ స్థానం, పద్యపఠనం, పాటల పోటీల్లో నందిని, హెచ్.వర్షిణి కన్సోలేషన్ బహుమతులు పొందారు. వీరికి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, సుపథ వ్యవస్థాపకులు యుఎఎన్ రాజు, నిర్వాహకులు శ్రీహరి శర్మ, ఎంఇఒ సిహెచ్.కూర్మారావు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. వీరిని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు అభినందించారు.

నేరాలు ఘోరాలు

స్వధార్ హోమ్‌లో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి -కంటోన్మెంట్

నగరంలోని మహిళా ప్రాంగణం లో ఉన్న స్వధార్ హోమ్‌లో మహిళా ఆత్మహత్య చేసుకుందని రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ తెలిపారు. కొత్తవలసలో ఒక ప్రాపర్టీ కేసులో వాగెలా భారతి(21) భర్త అబూజా అరెస్ట్ కావడంతో ఆమెకు ఎవరు లేకపోవడంతో స్వధార్ హోమ్‌లో ఉంటుంది. ఈనేపథ్యంలో ఆమె ఆత్మహత్య చేసుకుంది. హోం ఇన్‌ఛార్జి భవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చింతలపాలెంలో చోరీ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలో చింతలపాలెం సమీపంలోని డెక్కన్ ఫెర్రో కంపెనీ వద్ద ఉన్న ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సుమారు మూడు తులాల బంగారం, రూ.24 వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు మీసాల సత్యవతి పోలీసులకు ఫిర్యాదుచేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్.కోట రూరల్ సిఐ అప్పలనాయుడు, విజయనగరం నుంచి క్లూస్ టీం వచ్చి పరిశీలించారు.

ఆరుగురిపై కేసు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నగరంలోని జొన్నగుడ్డి ప్రాంతంలో పేకాట శిబిరంపై వన్ టౌన్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. జొన్నగుడ్డి ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పేకాట శిబిరం పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకొని వారి నుంచి రూ. 17,070 నగదు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు

ప్రాధాన్యతా రంగాలను గుర్తించాలి

సిఐటియు మన్యం జిల్లా మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి -పార్వతీపురం/పాలకొండ

జిల్లాలోని ప్రాధాన్యతా రంగాలను గుర్తించి సంఘం బలోపేతానికి కృషి చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. సందర్భంగా పాలకొండలోని గాయత్రి కల్యాణ మండపంలో జరుగుతున్న సిఐటియు 11వ జిల్లా మహాసభ రెండో రోజు ఆదివారం నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోగాని, రాష్ట్రంలో గానీ ప్రభుత్వాలను నిలదీయాలంటే సిఐటియు ఒక్కటే మొనగాడిగా నిలుస్తోందన్నారు. అయితే ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలను నిలదీయడానికి వ్యూహం వుండాలని చెప్పారు. దీని కోసం జిల్లాలోని రవాణా, విద్యుత్ రంగాలను ఎన్నుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా ఒక గంట నిలిచిపోతే మనిషి బతకలేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఇలాంటి కీలకమైన రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో కలసి పోరాడితే ప్రభుత్వాలు కూలిపోతాయని చెప్పారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరిస్తే ఆ శాఖలో పనిచేస్తున్న చిరు ఉద్యోగుల నుంచి ఉన్నతాధికారుల వరకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ సొంత నియోజకవర్గం వారణాసిలో విద్యుత్ ప్రయివేటీకరణను ఉద్యోగులు తీవ్రంగా ప్రతిఘటించారని చెప్పారు. తోపుడు బండ్ల వ్యాపారులు రోడ్డు పక్కన పెట్టి వ్యాపారం చేసుకునే హక్కు ఉందన్నారు. గ్రామాల్లోని ఆటో, భవన నిర్మాణ కార్మికులను సమీకరించి వారి సమస్యలు పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఏ ఉద్యోగిని తొలగించకూడదని చెప్పారు. జిల్లాలోని బలిజిపేట మండలం అరసాడలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపుపై హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రజా సంఘాల నిరసనలపై నిర్బంధాలు ఎక్కువయ్యాయని చెప్పారు. రాజ్యాంగంలో నిరసన తెలిపే హక్కు వుందని, దాన్ని కాదనే హక్కు ఏ ప్రభుత్వానికి లేదన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి కేసుల భయంతోనే మోడీకి దాసోహమయ్యారని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని దౌర్భాగ్య పరిస్థితి ఎపిలో వుందన్నారు. టిడిపి, జనసేన, వైసిపిలు మోడీ చంకలో వున్నాయని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను అడ్డుకోవడంలో సిఐటియు ఆధ్వర్యాన కార్మికుల పోరాటాలే కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. నాలుగేళ్లుగా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు ప్రయత్నిస్తున్న మోడీ ప్రభుత్వం కార్మికుల ప్రతిఘటనతో వెనకడుగు వేస్తోందని చెప్పారు. కార్మికులను కదిలిస్తే ఎలాంటి ఉద్యమాలనైనా నిర్మించవచ్చునని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని, పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల పోరాటానికి హిట్లర్ లాంటి నియంతలే మట్టిలో కలిసి పోయారని చెప్పారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ దేశంలో కార్మికోద్యమాల దశ, దిశ నిర్దేశించే సిఐటియు జాతీయ మహాసభలు తొలిసారి ఉత్తరాంధ్రలో జరుగుతున్నాయని చెప్పారు. 27 రాష్ట్రాల నుంచి కార్మిక సంఘాల నాయకులు, చైనా, వియత్నాం, క్యూబా దేశాల కార్మిక ప్రతినిధులు మహాసభలకు హాజరు కానున్నారని చెప్పారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కార్యదర్శి వి.ఇందిర, నాయకులు ఎన్‌వై నాయుడు, బివి రమణ, గొర్లె సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

నూతన కమిటీ ఎన్నిక

మహాసభ అనంతరం 47 మంది సభ్యులతో నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా డి.రమణారావు, ప్రధాన కార్యదర్శిగా వై.మన్మధరావు, జిల్లా కోశాధికారిగా గొర్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శులుగా బివి రమణ, ఎన్.వై.నాయుడు, ఎం.ఉమామహేశ్వరి, వి.రామలక్ష్మి, జి.జ్యోతిలక్ష్మి, వై.శాంతికుమారి, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, ఆర్.రాము, వి.ఇందిరా, ఎం.శివాని, ఎన్.హిమప్రభతో పాటు మరో 33 మంది జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సినీనటుడు నారాయణమూర్తి

కార్మిక చట్టాల రద్దు దుర్మార్గం
సిఐటియు మహాసభలో విప్లవ నటుడు నారాయణమూర్తి

ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. పాలకొండ పట్టణంలో జరుగుతున్న సిఐటియు 11వ జిల్లా మహాసభ సందర్భంగా ఆదివారం నిర్వహించిన సిఐటియు ప్రతినిధుల సభకు ఆయన హాజరయ్యారు. యూనివర్శిటీ పేపర్ లీక్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా పాలకొండకు వచ్చిన నారాయణమూర్తి సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను కార్మికులు ఐక్యంగా ప్రతిఘటించాలని సూచించారు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అనే నినాదంతో కార్మికులు పోరాడిన చందంగానే కమ్యూనిస్టు పార్టీలు కూడా ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రపంచీకరణలో భాగంగా కార్పొరేట్ కంపెనీలు అన్ని రంగాలను ఆక్రమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం బలవంతంగా ప్రజావ్యతిరేక విధానాలను రుద్దుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు ఐక్య పోరాటాలు చేయకపోతే హక్కులు కోల్పోతారని హెచ్చరించారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీలు బాగా పని చేస్తున్నాయన్నారు. ఎర్రజెండాలన్నీ ఒకే అజెండాతో పోరాడితే ఢిల్లీ ఎర్రకోట కార్మికుల వశమవుతుందని చెప్పారు. అనంతరం తన సినిమాల్లో పాటలతో ఉర్రూతలూగించారు.

ఫీజుల దందా ఇంకెన్నాళ్లు?

ప్రయివేటు విద్యాసంస్థల్లో దోపిడీ ● సిబిఎస్ఇ, ఒలింపియాడ్ పేరుతో అడ్డగోలుగా వసూళ్లు

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న కొన్ని ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల పేరుతో దందా సాగుతోంది. గజపతినగరానికి కూతవేటు దూరంలో ఉన్న బోడసింగిపేట రెవెన్యూ పరిధిలో ఓ ప్రయివేటు పాఠశాలలో ఉన్నత చదువులు చదివించాలనే తల్లిదండ్రుల ఆశలను ఆసరాగా తీసుకొని, అధిక ధరలకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ, బస్సు ఫీజులు బహిరంగంగానే వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ స్కూల్లో చదవాలంటే యూనిఫాం నుంచి పుస్తకాల వరకు తమ దగ్గరే కొనాలంటూ బలవంతంగా నిబంధన విధించి, అమ్మకాలు సాగించారు. అయినా, సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. ఆ పాఠశాలలో గతేడాది కంటే అధికంగా ఫీజులు పెంచడంతో పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు కల్పించుకున్నా అడ్డగోలుగా ఫీజులు మాత్రం వసూలు చేస్తున్నారు. సిబిఎస్ఇ సిలబస్.. అంటూ తల్లిదండ్రుల ముందు బ్రోచర్లు పెట్టి, పాతిక వేలతో మొదలెట్టి, ఆపై అనేక కోర్సులు (ఒలంపియాడ్, జనరల్) పేర్లు చెప్పి చదవాలంటే రూ. లక్ష వరకు గుంజేస్తున్నారు. ప్రయివేట్ స్కూళ్లలో ఫీజుల వివరాలు తరగతి వారీగా తెలిపే బోర్డు ప్రదర్శించాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకునే పాపాన పోలేదు.

భవిష్యత్తు తరాలకు ఉజ్వల భవితను అందించాలనే మాటలు చాలా వరకు మనం వినే ఉంటాం. బహుశా ఇలాంటి మాటలు వినేమో.. గ్రామం, పట్టణం.. అనే తేడా లేకుండా పేద కుటుంబాలు సైతం తమ పిల్లలను ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నాయి. పిల్లల భవిష్యత్తు బాగుండాలని తాపత్రయ పడుతూ వారు చెప్పే ఫీజులను సైతం అప్పులు చేసి చెల్లిస్తుంటాయి. ఇదే అదునుగా చేసుకొని ప్రయివేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఆ ఫీజు, ఈ ఫీజు.. అంటూ దోపిడీ చేస్తున్నాయి. ఏటా అధిక మొత్తంలో ఫీజులు పెంచుతూ ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నాయి.


SURESH IIT CONCEPT SCHOOL
BODA SINGIPETA, BONDAPALLI, GAJAPATHINAGARAM.
School fee
5th (olympiad) :- 25,000 - 23000
Bus Fee 7000
5th (General) :- 21,000 - 18,000 / -
C.B.C
8th class :- I.I.T :- 34000 - 32000
8th class (General) :- 26000 - 24000
Books
5th olympiad :- 6500
5th (General) :- 5600
8th I.I.T :- 9300
8th (General) :- 5410

అనుమతులు లేకుండా ఒలింపియాడ్ పేరుతో వసూలు చేస్తున్న ఫీజులు

ఫీజుల విషయంపై పలువురు తల్లిదండ్రులు యాజమాన్యాన్ని ప్రశ్నించగా, నర్సరీ నుంచి ఏడో తరగతి వరకు సిబిఎస్ఇ సిలబస్ ఉంటుందని, పరీక్షలు మాత్రం స్టేట్ బోర్డు ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారని తెలిపినట్లు సమాచారం. మూడో తరగతిలోనే ఏడో తరగతి సిలబస్ అంటూ తల్లిదండ్రులను మభ్యపెట్టి అడ్మిషన్లు స్వీకరించి, అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. సమీప గ్రామానికి చెందిన పేద కుటుంబ నేపథ్యం ఉన్న విద్యార్థి తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ ప్రయివేటు స్కూల్లో చదివించాలని ఆశతో వెళ్తే, వారు చెప్పే ఫీజులు చూసి అవాక్కయ్యారు. ఐదో తరగతికి స్కూల్ ఫీజు రూ.25 వేలు, పుస్తకాలకు రూ.6500, ఎనిమిదో తరగతికి స్కూల్ ఫీజు రూ.34 వేలు, పుస్తకాలకు రూ.9300, ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి బస్సు ఫీజు రూ.7 వేలు చెప్పడంతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోయారు. అంతేకాకుండా తమ స్కూల్లో చదవాలంటే తమ వద్దే యూనిఫాం కొనాలనే షరతు పెట్టారు. దిక్కు తోచని స్థితిలో చేసేదేమీ లేక అప్పు చేసి తమ పిల్లలను చేర్పించినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదే తరహాలో కింది తరగతుల నుంచి పైతరగతులు చదవాలన్నా, అనేక కారణాలతో అధిక ఫీజులను వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అడ్డూ అదుపూ లేని ప్రయివేట్ స్కూల్ దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. సిబిఎస్ఇ, ఒలింపియాడ్ సిలబస్ పేరుతో చేస్తున్న ప్రచారంపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సిబిఎస్ఇ అనుమతులు లేవు

మా పరిధిలో ఏ ప్రయివేట్ పాఠశాలలో కూడా సిబిఎస్ఇ సిలబస్ చెప్పడానికి అనుమతులు లేవు. సిబిఎస్ఇ సిలబస్ పేరుతో అడ్మిషన్లు తీసుకుంటే చర్యలు తప్పవు. అధిక ఫీజుల వసూళ్లు, పుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- కె.శోభారాణి, అల్లు వెంకటరమణ, ఎంఇఒలు, బొండపల్లి

కేంద్రమంత్రిని కలిసిన అఫా బృందం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ (అఫా) నూతన అధ్యక్షులు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం శ్రీకాకుళంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా అఫా కార్యవర్గం ఎన్నిక, తదితర అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. అనంతరం ఈ నెల 18,19,20న బెంగళూరులో జరిగే జాతీయస్థాయి ఎఫ్ఆర్‌హెచ్ఎ సమావేశానికి హాజరుకావాలని కేంద్రమంత్రికి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ హోటల్ అసోసియేషన్ భవిష్యత్తులో మరింత ఉన్నతంగా తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అఫా మాజీ గౌరవ కార్యదర్శి మెట్ట నాగరాజు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాస్, వినోద్, నాగావళి ఆనంద్ పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా బెవర

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన బెవర సత్యంనాయుడు కాంగ్రెస్ పార్టీ కిసాన్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.యస్. షర్మిల నియామక పత్రాలు జారీ చేశారు. ఇటీవల విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌లో కాంగ్రెస్ పార్టీ కిసాన్ విభాగం రాష్ట్ర చైర్మన్ కామన్ ప్రభాకర్ రావు, మాజీ ఎంపి కనుమూరి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి చేతులు మీదుగా నియామక ఉత్తర్వులను సత్యంనాయుడు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని రైతు సమస్యల పట్ల పోరాటాలు చేస్తామని వెల్లడించారు. 45 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లోనే కొనసాగుతుండడంతో తమను గుర్తించి పదవి అప్పగించడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు.

పిల్లలంతా పుస్తకాలు చదవాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పిల్లలంతా పుస్తకాలను చదవాలని రామనారాయణం ట్రస్ట్ గౌరీ నిత్య నారాయణ అన్నారు. ఆదివారం గురజాడ అప్పారావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విశాఖపట్నం బుక్ మ్యాజిక్ లైబ్రరీ వారి బుక్ మ్యాజిక్ రీడర్స్ క్లబ్ చాప్టర్ పుస్తకాన్ని ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. విజయనగరం లీడర్స్, విద్యలహరి పుస్తక్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వాల్మీకి రీసెర్చ్ సెంటర్ హెడ్ గౌరీనిత్య నారాయణ మాట్లాడుతూ రాముని బాణంలా తయారు కావాలంటే రామాయణం అందరిలోకి వెళ్లాలన్నారు పుస్తక సమీక్షలు డాక్టర్ కట్టమూరి చంద్రశేఖరం మాట్లాడుతూ పిల్లల పుస్తకాల పఠనం రోజురోజుకూ తగ్గుతోందని, ప్రతి ఒక్కరూ పిల్లలను పుస్తకాలను చదివించే విధంగా తయారు చేయాలని అన్నారు ఆయన మైథిలి పుస్తక పరిచయం చేశారు. ఎంవిజిఆర్ కళాశాల ఇంగ్లీష్ అసిస్టెంట్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం అంటే మనల్ని మనం తీర్చిదిద్దుకోవడం అన్నారు. మరో సమీక్షకులు ఈశ్వర్ మాట్లాడుతూ నా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ పి వి జి రాజు అన్నారు. అశోక్ గజపతి రాజు గారి రచించిన పివిసి రాజు పుస్తకాన్ని సమీక్ష చేశారు. విద్యా వ్యాప్తికి పివిజి రాజులా దేశంలో మరెవరూ కృషి చేయలేదన్నారు. కార్యక్రమంలో అనేకమంది సాహితీవేత్తలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరంలోని నేత్రాలయ ఐకేర్ వద్ద సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆప్తాలమిస్టు గిరిజ 90 మందికి పరీక్షలు చేశారు. 51 మందికి కేటరాక్ట్ శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. సహాయ స్ఫూర్తి అధ్యక్ష, కార్యదర్శులు సాయి కుమార్, రేవంత్, నేత్రాలయ ఐ కేర్ నిర్వాహకులు మౌనిక, కృష్ణ, సభ్యుడు శ్యామ్, క్యాంప్ కోఆర్డినేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

పోరాటాలతో రూ.9వేలు పింఛను సాధించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఇపిఎఫ్ కనీస పింఛన్ రూ.9వేలను పోరాటాలతో సాధించుకోవాలని ఇపిఎఫ్ పింఛన్‌దార్ల సంఘం జిల్లా కార్యదర్శి ఒఎస్ఎన్ మూర్తి, కోశాధికారి అంబళ్ల గౌరినాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అమర కార్మికుల భవనంలో ఇపిఎఫ్ పింఛన్ దార్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం ఇపిఎఫ్ నిధికి సంవత్సరానికి రూ.1.31లక్షల కోట్లు వస్తుంటే కనీస పింఛన్ రూ.23వేల కోట్లు కూడా లేవన్నారు. 80 లక్షల మంది పింఛన్‌దార్లలో 60శాతం మందికి కేవలం 1500, 97శాతం మందికి రూ.4వేలు లోపు పింఛన్ చెల్లిస్తున్నారన్నారు. పింఛన్‌దార్లు కోరుతున్న కనీస పింఛన్ 9వేలు సులభంగా ఇవ్వవచ్చున్నారు. కానీ మోడి ప్రభుత్వం చట్ట విరుద్ధంగా ఆలోచించి సామాజిక భద్రత చట్టాన్ని అడ్డంగా పెట్టుకొని స్కీమ్‌లు మార్చి పింఛన్ నిధులు విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకుద్రవ్య పెట్టుబడులుపెట్టాలని చూస్తున్నారని చెప్పారు. ఇపిఎఫ్ పింఛన్‌దార్లు పోరాటంతో కనీసం పింఛన్ రూ.9వేలు సాధించాలని పిలుపునిచ్చారు. పెన్షన్‌పై డిఎలు వర్తింపచేయాలని, రైల్వే టికెట్లపై రాయితీలు ఇవ్వాలని, పెన్షన దారుల కుటుంబానికి మెడికల్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇపిఎఫ్ పింఛన్‌దార్ల సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, కనకల పద్మ నాభం, నామాల తిరుపతిరావు, అప్పలనరసయ్య, పింఛన్ దార్లు కంది శ్రీరాములు, నడి పేన రామ్మూర్తి, కాళ్ల సూర్య నారాయణ, యడ్ల పైడి నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పింఛనుదార్ల సంఘం నాయకులు ఎ.గౌరినాయుడు

యుటిఎఫ్ రణభేరిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- రాజాం

ఉత్తరాంధ్రలో సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు జరగనున్న రణభేరి బైక్ జాతాను ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్ వద్ద యుటిఎఫ్ రణభేరి కరపత్రాలను ఆదివారం రాజాం డివిజన్ కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షతన యుటిఎఫ్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ఆర్థిక, విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో అప్పుడు పోరుబాట చేశామని, నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలల గడిచినా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంలో చొరవ చూపకపోవడం తగదని అన్నారు. బోధనేతర పనులు రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనికే పరిమితం చేయాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడానికి కృషి చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తన విద్యా విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జిల్లా కార్యదర్శి పక్కివాసు, మాట్లాడుతూ విజయనగరం జిల్లా రణభేరి జాత సెప్టెంబర్ 17వ తేదీన బొబ్బిలిలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమవుతుందని, దానికి రాజాం డివిజన్ ఉపాధ్యాయులు హాజరై విజయనగరం జిల్లా బైక్ జాతాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు పళ్ళ మురళి, బలివాడి నాగేశ్వరరావు, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండల నాయకులు డోల కృష్ణారావు, ముప్వల రమేష్, బెవర జగదీశ్వర రావు, గురవాణ విష్ణుమూర్తి, వారాడ సత్యంనాయుడు, మూడడ్ల శ్రీనివాసరావు, గడే అప్పలనాయుడు, రౌతు దాలినాయుడు, గురుమూర్తి, నారాయణరావు, రవి, ఆనంద రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మల్లమ్మ చెరువుకు గండి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని మల్లమ్మపేట సమీపంలో ఉన్న మల్లమ్మ చెరువు గట్టుకు శనివారం గండి పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు, విఆర్ఎస్ కాలువ నీరు చెరువులో చేరింది. చెరువు గట్టు బలహీనంగా ఉండడం, మదుము పాడైపోవడంతో గట్టుకు గండి పడిందని రైతులు చెబుతున్నారు. చెరువు ఆధారంగా 100 ఎకరాలలో రైతులు సాగు చేస్తున్నారు. నీరు బయటకు పోకుండా నివారించేందుకు రైతులు ఇసుక బస్తాలతో గండిని తాత్కాలికంగా పూడ్చారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ హిందీ దినోత్సవాన్ని స్థానిక కేంద్రీయ విద్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హిందీ ఒక భాష మాత్రమే కాదని, మనదేశంలో ఎక్కడైనా సులభంగా మన జీవన విధానాన్ని మలిచే సాధనమని జిల్లా యువజన అధికారి ఎన్.ప్రేమ్ భరత్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు వికసిత భారత్ - 2047 అనే అంశంపై వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దిలీప్ మోడీ, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT BOBBILI
H.M.O.P.28/2025

Between:
Koripalli Seshagiri ...Petitioner
And
Koripallli [Datti] Neelima ...Respondent

NOTICE

To, **The Respondent**:
Smt Koripilli [Datti] Neelima,
W/o.Koripalli Seshagiri,
R/at Terlam Village, Terlam Mandalam, Near SBI,
Old Cinema Hall, Terlam,
Vizianagaram District-535 126.

Please take notice that the above named petitioner has instituted the above case against you and the matter stands posted to **25-09-2025** for your appearance on that day **10:30A.M.**, you should appear before the aforesaid Hon'ble court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
K.SUDHARANI, Advocate
Bobbili, Visakhapatnam
Cell: 9494374886.